అధ్వానంగా సరాండి రహదారి

- రోడ్డంతా గుంతలు
- మరమ్మతులు చేపట్టని వైనం

వాంకిడి: దశాబ్దాల క్రితం నిర్మించిన బీటీ రహదారులకు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. రహదారులపై గుంతలు, రంధ్రాలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్లపైనే ప్రయాణిస్తున్నా మరమ్మతులు చేపట్టడం, నిధులు మంజూరు చేయడంలో విఫలమవుతున్నారు. మండల కేంద్రం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాండి గ్రామానికి వెళ్లే రహదారి గుంతలతో నిండిపోయింది.

రోడ్డుపై గుంతలు..

మండల కేంద్రంలోని నేషనల్ హైవే -363 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న సరాండి గ్రామానికి వెళ్లే రహదారిపై బీటీ నిర్మించి పదేళ్లు కావస్తుంది. కానీ ఇప్పటికీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడం, కొత్త బీటీరోడ్డు మంజూరు చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. మూడు కిలోమీటర్ల రహదారి పొడవున చిన్న ఒర్రెలపై నిర్మించిన 10 కల్వర్టులు ఉన్నాయి. ఈ కల్వర్టులపై భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. వీటిని వాహనదారులు గుర్తించలేని పరిస్థితుల్లో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. కొత్త వారు లేదా రాత్రుల్లో ప్రయాణించే వారు ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఖిరిడి, ఇందాని, నవేగూడ, గడెమార్గ్(నవేగాం) గ్రామ పంచాయతీల పరిధిల్లోని పదుల సంఖ్యలోని గ్రామాల ప్రజలు, మండల కేంద్రానికి రావాలంటే సరాండి రహదారి గుండానే వెళ్లాల్సి ఉంటుంది. దీంతో నిత్యం ఈ రహదారిపై వందల మంది ప్రయాణిస్తుంటారు. ఇప్పటికే రహదారి పొడవున భారీ రంధ్రాలు, గుంతలు ఉండడంతో వర్షాకాలంలో రోడ్డు పరిస్థితి ఎలా మారుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గుంతలు ఏర్పడిన ప్రాంతాల్లో కనీసం మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



గుంతలమయంగా రోడ్డు



రహదారిపై ఏర్పడిన రంధ్రం

ప్రమాదకరంగా రహదారి



మా గ్రామం నుంచి మండల కేంద్రం వరకు ఉన్న బీటీ రహదారి ప్రమాదకరంగా మారింది. అడుగడుగున గుంతలతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. చిన్న చిన్న ఒర్రెలపై ఉన్న కల్వర్టుల వద్ద భారీ రంధ్రాలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలపై ప్రయాణించాలంటే భయంగా ఉంది.

– మొహర్లే సుభాష్, సరాండి

అధికారులు పట్టించుకోవడం లేదు



నేను స్కూల్‌లో చదువుకునే సమయంలో మా గ్రామానికి బీటీ రహదారి వేశారు. ఇప్పుడు నాది డిగ్రీ పూర్తయ్యింది. కానీ ఇప్పటి వరకు రోడ్డుకు మరమ్మతులు చేపట్టలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.

– మొహర్లే భీంరావు, సరాండి

బీటీరోడ్డు మంజూరు చేయాలి



దశాబ్దాల క్రితం నిర్మించిన సరాండి బీటీ రహదారి పాడైపోయింది. ప్రతీరోజు వందల మంది మండల కేంద్రానికి ఇదే రోడ్డు గుండా ప్రయాణిస్తుంటారు. రహదారిపై గుంతలు, రంధ్రాలు ఉండటంతో ప్రయాణం భయంగా ఉంది. అధికారులు నూతన బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

– గొత్రే బుద్దాజీ, సరాండి

పాఠశాలలో సౌకర్యాలు కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ

రెబ్బెన: మండలంలోని తుంగెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు, ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పనకు కృషి చేయాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య కోరారు. శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆమె నివాసంలో కలిసి పాఠశాలకు బోర్‌వెల్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ తుంగెడ ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్‌లో సుమారు 200 మంది విద్యార్థులు చదువుతున్నారన్నారు. పాఠశాలలో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు తాగేందుకు, మరుగుదొడ్ల వినియోగానికి నీటి సౌకర్యం లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పాఠశాలకు నూతన బోర్‌వెల్ మంజూరు చేయాలని కోరారు. హెచ్‌ఎం వినయ్‌కుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని న్యూరాజంపేట కాలనీకి వెళ్లే రోడ్డు స్థలాన్ని వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు శనివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. కాలనీవాసులు మాట్లాడుతూ నిరుపేదల కోసం ప్రభుత్వం గతంలో ప్లాట్లు కేటాయించగా కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నామన్నారు. కాలనీకి వెనుక భాగంలో రోడ్డుకు స్థలం కేటాయించినప్పటికీ రోడ్డుకు స్థలాన్ని వదలకుండా కొందరు నిర్మాణాలు చేపడుతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను నిలిపివేసి కాలనీకి రోడ్డు కోసం స్థలం కేటాయించాలని కోరారు. కాలనీవాసులు బుర్సా పోచయ్య, గోపి, మల్లయ్య, అరుణ్, మంగేశ్వరీ, కాలనీవాసులు ఉన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నిబంధనలు బేఖాతరు చేస్తూ పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలకు చెక్ పెట్టాలన్నారు. పాఠశాలలకు సరైన భవనాలు లేక రేకుల షెడ్లలోనే చదువులు కొనసాగిస్తున్నారన్నారు. పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేని పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో టీవీయూవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోపాల్, టీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి క్రాంతికుమార్, జేవీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంశీ, టీవీయూవీ జిల్లా ఇన్‌చార్జి సిద్ధార్థ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బ్యూటీషియన్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



కోర్సులో పాల్గొన్న విద్యార్థినులు

ఆసిఫాబాద్: వాంకిడి మండలం బెండారలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత బ్యూటీషియన్ కోర్సు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య శనివారం అన్నారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభించినట్లు, 45 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయ కర్త శారద, మహిళా సాధికారత స్పెషలిస్టు రాజేశ్వరి, శిక్షణ నిపుణురాలు సంధ్యారాణి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. నెలవారీ మరమ్మతుల వల్ల కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

చింతలమానెపల్లి: ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్‌ను శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోని శ్రీశైలం, జిల్లా కార్యదర్శి బండి రాజేందర్ గౌడ్‌లు ఆదిలాబాద్‌లోని ఆయన స్వగృహంలో కలిశారు. జిల్లాలోని పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. మండలంలోని దిందా వంతెన, గూడెం రహదారి, బాబాసాగర్ వంతెనలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బీజేపీ మండల యూత్ అధ్యక్షుడు దోని సురేశ్ పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కౌటాల: మండలంలోని ముత్తంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన రావుతు గోపిక, చిలువేరి లావణ్య ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం గావుడే హన్మంతు శనివారం తెలిపారు. గత సంవత్సరం 8వ తరగతి చదివిన విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఒక్కో విద్యార్థికి ఇంటర్మీడియెట్ వరకు సంవత్సరానికి రూ. 12వేలు చొప్పున మొత్తం 48 వేల ఉపకార వేతనాలు విద్యార్థుల బ్యాంక్ అకౌంట్‌లో జమ చేస్తారన్నారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పరామర్శ



పరామర్శిస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు

జైనూర్: గతంలో ఒక వర్గం యువకులు దాడి చేయగా గాయపడిన ఆదివాసీ యువకుడిని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మడావి మనోహర్, సంఘం నాయకులు శనివారం పరామర్శించారు. సిర్పూర్(యూ) మండలంలోని పాములవాడ మర్సుకొల లక్ష్మణ్‌ను పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరించే తీరు సరికాదన్నారు. 15 రోజుల లోపు న్యాయం జరగకపోతే ఆదివాసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో 10 వేల మందితో జిల్లా పోలీసు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు మెస్రం షేకు, విద్యార్థి పరిషత్ జిల్లా అధ్యక్షుడు భగవంత్‌రావు, నాయకులు ఉన్నారు.

మానవ మృగాన్ని కఠినంగా శిక్షించాలి



కాగజ్‌నగర్‌రూరల్: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



బెజ్జూర్: క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

కాగజ్‌నగర్‌రూరల్: చిన్నారిని మట్టుబెట్టిన మానవ మృగాన్ని ఉరితీయాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో చిన్నారి అత్యాచార, హత్య ఘటనకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని ఉరి తీయాలన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వీరభద్రచారి, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, నాయకులు దెబ్బటి శ్రీనివాస్, దీపక్, తిరుపతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి గ్రామంలో జరిగిన ఘటనలో నిందిడిని కఠినంగా శిక్షించాలని శనివారం జిల్లా కేంద్రంలో ఆసిఫాబాద్ ఎస్‌హెచ్‌వో సతీశ్‌కు ఆరె సంక్షేమ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బొట్టుపల్లి జైరాం, ఉపాధ్యక్షుడు కోలె బిక్కాజి, నాయకులు అన్నారావ్, మారుతి, సంతోష్, శ్యాంరావు, మోహన్, వెంకన్న, బాలకిషన్, బిజ్జు, జిమ్నాజి తదితరులు ఉన్నారు.

పెంచికల్‌పేట్: సుల్తానాబాద్‌లో చిన్నారిపై అత్యాచారం చేసి హతమార్చిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. అఘాయిత్యాలను అరికట్టడానికి ప్రభుత్వం కఠినమైన చట్టాలు తీసుకురావాలన్నారు. సంఘం నాయకులు డోకె మహేశ్, పాలె సంతోష్, శ్రీనివాస్, భీమయ్య, రాజేశ్, రమేశ్, శ్యాం, కాంతారావు, నరేశ్, హరీశ్ పాల్గొన్నారు.

బెజ్జూర్: చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని మండల ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తా నుంచి బస్టాండ్ ఏరియా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.

కౌటాల: ఆరేళ్ల పసికందును అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన మానవ మృగాన్ని శిక్షించాలని గుడ్లబోరి గ్రామస్తులు అన్నారు. శనివారం రాత్రి గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ తీసి బాలిక చిత్రపటానికి నివాళులర్పించారు. ఎంపీటీసీ వసంత్‌రావు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దహెగాం: కామాంధుడి చేతిలో అత్యాచారం హత్యకు గురైన బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ. 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు 5 ఎకరాల భూమి, ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ విజిలెన్స్ సభ్యుడు రేగుంట కేశవ్‌రావు మాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల రమేశ్, అధికార ప్రతినిధి రేగుంట మహేశ్, మండల నాయకులు నక్క శ్రీనివాస్, ఆరె సంక్షేమ సంఘం గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు ప్రశాంత్, విలాస్ తదితరులు ఉన్నారు.



పెంచికల్‌పేట్: పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందజేస్తున్న యువకులు



దహెగాం: బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేశవ్‌రావు మాదిగ

లోపించిన పారిశుధ్యం



దహెగాం మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. మండల కేంద్రంలోని చేతి పంపు వద్ద మురుగు నీరు నిల్వ ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు నిల్వతో మంచి నీరు కూడా కలుషితమయ్యే ప్రమాదం ఉంది. డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతోనే చేతిపంపు వద్ద మురుగు నీరు నిల్వ ఉంటుందని మండలవాసులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ కాకుండా చూడాలని కోరుతున్నారు. - దహెగాం

రైళ్లు ఆగని రైల్వేస్టేషన్!

- కరోనా సమయంలో కొన్ని రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత
- ఆధునికీకరణ పనులతో ఒక్క రైలు కూడా ఆగని వైనం..
- అలంకారప్రాయంగా మారిన రేచినిరోడ్ రైల్వేస్టేషన్
- ఇబ్బంది పడుతున్న రైలు ప్రయాణికులు



నిర్మాణం పూర్తయిన నూతన భవనం

తాండూర్: ఆధునికీకరణ పనుల్లోని అలసత్వం రైలు ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. మరమ్మతు పనులు నత్తనడకన సాగుతుండడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. నిర్మాణ పనుల పేరిట రైలు సేవలు నిలిచిపోవడంతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. దీంతో తాండూర్ మండలంలోని రేచిని రోడ్ రైల్వేస్టేషన్ అలంకార ప్రాయంగా మారింది.

ఆధునికీకరణ సరే... అందుబాటులోకి ఎప్పుడు...?

రైల్వేశాఖ దేశ వ్యాప్తంగా రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు శ్రీకారం చుట్టింది. అందుకు అనుగుణంగా పనుల మంజూరు, టెండర్ ప్రక్రియను శరవేగంగా పూర్తి చేసింది. ఇందులో భాగంగా రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో సుమారు రూ.4కోట్ల అంచనాతో నూతన భవన నిర్మాణాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, నూతన ప్లాట్‌ఫామ్‌లతో పాటు ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయి. అంత వరకు బాగానే ఉన్నా నిర్మాణ పనుల ప్రక్రియ వేగవంతంగా జరగడం లేదు. నత్తనడకగా సాగుతున్న పనులతో ప్రయాణికులకు రైళ్ల సౌకర్యాలు దూరమయ్యాయి.

నో హాల్టింగ్.. నో జర్నీ..

కరోనా సమయం నుంచే రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో దశల వారీగా కొన్ని రైళ్ల హాల్టింగ్‌లు ఎత్తివేశారు. ఇప్పుడైనా రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరిస్తారని ఆశపడ్డ ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొంతకాలం నుంచి మందకొడిగా సాగుతుండటం, మరోపక్క మూడో లైన్ పనులు జరుగుతుండటంతో రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరించడం లేదు. రామగిరి, సింగరేణి, భాగ్యనగర్, పుష్పుల్, ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సేవలు ప్రజలకు అందకుండా పోయాయి. దీంతో రైలు ప్రయాణం కోసం బెల్లంపల్లికి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

ఆగుతూ....సాగుతూ...

రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి ప్రధాన సమస్య. దశాబ్దాల నుంచి ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం రైలు ప్రయాణికుల దశాబ్దాల కల. రేచిని రోడ్ రైల్వేస్టేషన్ నుంచి రైలు ప్రయాణం చేయాలంటే రైళ్ల కింద నుంచి ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సిన పరిస్థితి. అంతటి క్లిష్టమైన సమస్య నేటికీ పరిష్కారానికి నోచులేకపోతోంది. నాలుగేళ్ల క్రితం ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరైనప్పటికీ అనివార్య కారణాల వల్ల రద్దయింది. ఇటీవల మళ్లీ మంజూరు కాగా ప్రస్తుతం నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బల్లార్షా నుంచి కాజీపేట వరకు పలు చోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేశారు. ఒకే టెండర్‌లో ఇవన్నీ ఉండటంతో ఒక్కొక్కటి పూర్తయి రేచిని రోడ్ రైల్వే స్టేషన్‌లో పనులు మొదలు పెట్టే సరికి తీవ్ర జాప్యం ఏర్పడింది. ఈ పనులు పూర్తయ్యేందుకు ఇంకో నాలుగు నెలల సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆలస్యంగా నైనా రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు కొనసాగుతుండడంతో రైలు ప్రయాణికుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నప్పటికీ, పనులు వే గంగా జరుగకపోవడంపై పెదవి విరుస్తున్నారు. అధికారులు స్పందించి రైల్వే ఆధునికీకరణ, స్టేషన్ మరమ్మతు, అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి రైళ్ల హాల్టింగ్‌లను పునరుద్ధరించి రైల్వే సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

రైళ్ల హాల్టింగ్‌లు పునరుద్ధరించాలి



రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ లేకపోవడం వల్ల తాండూర్, తిర్యాణి, భీమిని మండలాల ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో బెల్లంపల్లి రైల్వేస్టేషన్ నుంచి ప్రయాణం సాగిస్తున్నారు. రైళ్ల హాల్టింగ్‌లను వెంటనే పునరుద్ధరించి రైలు ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలి.

– కామని శ్రీనివాస్, కిష్టంపేట, తాండూర్

ప్రజల సౌకర్యార్థం మరొక రైలు నడపాలి



తెల్లవారుజామున భాగ్యనగర్ రైలు తరువాత మధ్యాహ్నం ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ముందు ప్రజల సౌకర్యార్థం మరొక రైలు నడపాలి. ఈ రెండు రైళ్ల మధ్య ఆరు గంటల వ్యవధిలో కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు రైళ్లు లేవు. రైళ్లను మళ్లీ ప్రారంభించడంతో పాటు ఇంకో రైలు నడిపితే బాగుంటుంది.

– ఫణికుమార్, తాండూర్

ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



రేచిని రోడ్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి. ఫుట్ ఓవర్ బ్రిడ్జి లేక వృద్ధులు, మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన ప్రయాణికులకు అందుబాటులో తీసుకురావాలి.

– జగన్మోహన్, తాండూర్ ఐబీ

బాధిత కుటుంబానికి పరామర్శ

నార్నూర్: ఇటీవల దారుణ హత్యకు గురైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావులు శనివారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలోని వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. సీఐకి ఫోన్ చేసి హత్య జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హత్య చేసిన వారిపై కేసులు నమోదు చేసి, కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని సూచించారు.

విద్యార్థులకు పెన్నులు అందజేత

బోథ్: మండలంలోని కనుగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చిలుక సతీశ్ శనివారం విద్యార్థులకు స్వీట్లు, పెన్నులు అందించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.